వార్త, హైదరాబాద్, బుధవారం 19, మార్చి 2025

# ఎప్‌సెట్‌కు 1.36 లక్షలు దాటిన దరఖాస్తులు

## ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు గడువు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్‌ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025కి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 1,36,425 దరఖాస్తులు వచ్చాయి. ఎప్‌సెట్-2025కి ఈ నెల 1 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 5010 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం సాయంత్రం వరకు 1,36,425 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్‌కి 98,046 దరఖాస్తులు రాగా.. అగ్రికల్చర్, ఫార్మసీకి 38,273 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 106 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఎప్ సెట్-2025 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయగా.. దరఖాస్తులను మార్చి 1 నుంచి స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఏప్రిల్ 4 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదిల్లో నిర్వహించనుండగా.. ఇంజనీరింగ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు.